క్లుప్తంగా

అవార్డు గ్రహీతకు సన్మానం



కానిస్టేబుల్ భాస్కర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

అమడగూరు: స్థానిక పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న భాస్కర్ ఇటీవల గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ చేతుల మీదుగా ప్రతిభా అవార్డు అందుకున్నారు. సోమవారం స్థానిక స్టేషన్‌లో భాస్కర్‌ను సిబ్బంది శాలువాలతో సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్ఐ బలరామయ్య మాట్లాడుతూ.. ఉద్యోగుల సేవలను ప్రభుత్వం గుర్తించి తగు అవార్డులు, రివార్డులు ఇస్తుందన్నారు. అవార్డు గ్రహీతలను ఆదర్శంగా తీసుకుని తోటి ఉద్యోగులు పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ ధనుంజయ, జమేదారు సుధాకర్, పాఠశాల చైర్మన్ దొడ్డెప్ప, పారిశుధ్య కార్మికులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సేవాగుణం అలవర్చుకోండి

ధర్మవరం అర్బన్: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో సోమవారం పరమసంస్థానమ్ శ్రీ పరమపిత వెంకటరమణాచార్య గురువు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో టూటౌన్ సీఐ అశోక్‌కుమార్ చేతులమీదుగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ.. పేదలకు సేవ చేయడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. సేవాగుణం అలవర్చుకోవాలని సూచించారు.

సజావుగా వేలం



వేలంలో పాల్గొన్న వ్యాపారులు

కదిరి అర్బన్: మండల పరిధిలోని యర్రదొడ్డి గంగమ్మ ఆలయంలో ఏడాది పాటు వివిధ వ్యాపారాలు నిర్వహించుకునేందుకు సోమవారం వేలం పాట నిర్వహించారు. టెంకాయలు, పూజా సామగ్రి విక్రయ హక్కులను రూ.9,95,000, చిల్లర అంగడి, కూల్ డ్రింక్ షాపు నిర్వహణ హక్కులను రూ.3,05,000, బొమ్మలు, దారాలు విక్రయ హక్కులను రూ.2,55,000, గాజులు విక్రయించుకునే హక్కు రూ.64 వేలు, ఐస్ క్రీమ్స్, చెరకు రసం విక్రయించుకునే హక్కులను రూ.2,40,000 వ్యాపారులు దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి, దేవదాయ తనిఖీ అధికారి నరసింహారాజు, ఈఓ రామాంజనేయులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

ధర్మవరం అర్బన్: పట్టణంలోని తారకరామాపురంలో ఉన్న అక్కమ్మ ఆలయంలో సోమవారం మన గుడికట్లు మన సంప్రదాయం గోత్రాలతో కూడిన నూతన క్యాలెండర్లను సీపీఐ రాష్ట్ర నాయకుడు జగదీష్ చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కురుబ కులస్తుల సాంప్రదాయాలు కట్టుబాట్లు ఉట్టిపడేలా క్యాలెండర్ ఉందని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ముసుగు మధు, పామాల కులశేఖర్, పాలసూరి, గుంజర శివయ్య, బుడగ వెంకటనారాయణ, మల్లికార్జున, నాగేంద్ర, గస్తి అనిల్, గుంజర శివ, చంద్రశేఖర్, గోసే కుమార్, గోపి, మహేష్, కమలాకర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు గైర్హాజరు



స్పందనకు అరకొరగా హాజరైన అధికారులు

గాండ్లపెంట: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి పలువురు అధికారులు డుమ్మా కొట్టారు. దాదాపు 27 శాఖల మండల స్థాయి అధికారులు హాజరు కావాల్సి ఉండగా వారిలో కేవలం ఐసీడీఎస్, ఎంపీడీఓ, హౌసింగ్, సెరికల్చర్, ఉపాధిహామీ 5 శాఖల అధికారులు మాత్రమే హాజరయ్యారు. అధికారుల గైర్హాజరుపై తహసీల్దార్‌ను సంప్రదించగా.. అధికారులందరూ స్పందనకు హాజరు కావాల్సి ఉందన్నారు. అయితే గైర్హాజరైన అధికారులు తనకు సమాచారం ఇవ్వలేదని తెలిపారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి



ప్రసన్నకుమార్ (ఫైల్)

బత్తలపల్లి: దంపెట్ల పంచాయతీ కార్యదర్శి భారతి భర్త ప్రసన్న కుమార్ (49) గుండెపోటుతో మృతి చెందారు. దంపతులు ఇద్దరూ ఆదివారం అరుణాచలం గిరి ప్రదర్శనకు వెళ్లగా.. అక్కడ ప్రసన్న కుమార్‌కు గుండెనొప్పి వచ్చింది. చికిత్స నిమిత్తం సొంతూరి తీసుకొచ్చేలోపు మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీదేవి, ఈఓఆర్డీ దివాకర్, దంపెట్ల సచివాలయ సిబ్బంది సంతాపం తెలిపారు. అలాగే ఎంపీపీ బగ్గిరి త్రివేణి, జెడ్పీటీసీ కోటి సుధ, వైస్ ఎంపీపీ గజ్జల వెంగళరెడ్డి, దంపెట్ల, గరిశలపల్లి సర్పంచులు చల్లా కరుణాకర్‌నాయుడు, మాదిరెడ్డి పద్మావతి, ఉప సర్పంచు నార్శింపల్లి రామాంజనేయులు తదితరులు సంతాపం ప్రకటించారు.

జగనన్న పాలన దేశానికే ఆదర్శం



తలుపుల: మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి



నల్లమాడ: మాట్లాడుతున్న ఎంపీపీ దుంగావత్ సునీతాబాయి

• ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి

తలుపుల: రాష్ట్ర వ్యాప్తంగా సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే అందజేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలిచారని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి కొనియాడారు. సోమవారం స్థానిక ఐకేపీ కార్యాలయంలో ఎంపీపీ రఫీనాయక్ అధ్యక్షతన ఏఓ రామానాయక్ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా సంక్షేమ, అభివృద్ధి పథకాలను అధికారులు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత గత డెబ్బై ఏళ్లుగా జరగని అభివృద్ధి చేశామన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా రోడ్డు సౌకర్యం, సచివాలయం, రైతు భరోసా, హెల్త్ సెంటర్లు కనిపిస్తాయని తెలిపారు. సహకారం పరపతి సంఘం అధ్యక్షుడు పూల శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్య, వైద్యానికి పెద్దపీట వేసిందన్నారు. నిరుపేదలకు పారదర్శకంగా పథకాలు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గిరిధర్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు ఓబుళేశ్వరి, మహేశ్వర్ రెడ్డి, తహసీల్దార్ కే.శ్రీదర్, ఈఓపీఆర్డీ శకుంతల, సర్పంచ్ శ్రీలత, వైద్యాధికారి అఫ్తాబ్, ఆయా శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తనీయొద్దు

నల్లమాడ: వచ్చే వేసవిలో మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ దుంగావత్ సునీతాబాయి, వైస్ ఎంపీపీ కే.సూర్యనారాయణ సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. నల్లమాడ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని ఎంపీపీ, వైస్ ఎంపీపీతో పాటు సర్పంచులు, ఎంపీటీసీలు మండల వ్యవసాయాధికారి సుమతికి సూచించారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కొండన్న, డిప్యూటీ తహసీల్దార్ ఎంఎస్ మల్లికార్జున, ఈఓఆర్డీ అమరనాథరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ప్రాంతీయ క్యాడర్ మీటింగ్‌కు హాజరైన ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి



మంత్రి రామచంద్రారెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి: తిరుపతిలో సోమవారం మంత్రి పెద్ది రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ ప్రాంతీయ కేడర్ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎమ్మెల్యే దుద్దుకుంట ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి హాజరయ్యారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వచ్చే నెలలో అనంతపురంలో జరిగే సిద్ధం బహిరంగ సభను విజయవంతం చేయాలని మంత్రి సూచించారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డితో కొంతసేపు ముచ్చటించారు.

నేడు తారు రోడ్డు ప్రారంభం

తలుపుల: మండలంలోని బట్రేపల్లి పంచాయతీలోని అప్రోచ్ రోడ్డు నుంచి మామిళ్లవారిపల్లి వరకూ వేసిన తారు రోడ్డు, అప్రోచ్ రోడ్డు నుంచి మూలపల్లి వరకు వేసిన సీసీ రోడ్డును మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రారంభించడం జరుగుతుందని సర్పంచ్ వెంకటనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సిద్దారెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు.

ఆకట్టుకున్న నమూనాలు



నమూనాలను తిలకిస్తున్న ఎంఈఓలు చెన్నకృష్ణ, ఓబుల్‌రెడ్డి

కదిరి అర్బన్: స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో సోమవారం ప్రిన్సిపాల్ ఎంఎస్ ప్రశాంత్ ఆధ్వర్యంలో అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను ఎంఈఓలు చెన్నకృష్ణ, ఓబుల్‌రెడ్డి ప్రారంభించారు. ఇంజినీర్లు చేసిన పెద్ద పెద్ద స్మార్ట్ ప్రాజెక్టులను ఈ ల్యాబ్‌లో చిన్న నమూనాలుగా చేసి విద్యార్థులు ప్రదర్శించారు. ఆకర్షణీయంగా తయారు చేసిన ఈ ప్రాజెక్టులను రెండు రోజుల పాటు ప్రదర్శించడం జరుగుతుందని ప్రిన్సిపాల్ తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు తయారు చేసిన త్రీడీ ప్రింటర్స్, స్మార్ట్ స్ట్రీట్ లైట్స్, స్మార్ట్ ఇరిగేషన్, రైన్ డిటెక్టర్లు పలువురిని ఆకట్టుకున్నాయి.

రైతన్నల సేవలో తరించండి



మాట్లాడుతున్న జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి

పుట్టపర్తి అర్బన్: వ్యవసాయం చేస్తూ అన్నం పెట్టే రైతన్నల సేవలో తరించడం అదృష్టంగా భావించాలని జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం కొత్తచెరువు మండలం కొడపగానిపల్లిలో తిరుపతి వ్యవసాయ విశ్వ విద్యాలయం అగ్రికల్చర్ బీఎస్సీ విద్యార్థులు రైతు సదస్సు–వ్యవసాయ పరిశోధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏరువాక శాస్త్రవేత్తలు డాక్టర్ రామసుబ్బయ్య, డాక్టర్ రవికిషోర్ ఏడీఏ విద్యావతి, తిరుపతి వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ రాజేశ్వరి సమక్షంలో రైతులతో సమావేశమయ్యారు. మూడు నెలల పాటు వివిధ ప్రాంతాల్లోని వ్యవసాయ క్షేత్రాల్లో ఏరువాక శాస్త్రవేత్తల మార్గదర్శనంలో తెలుసుకున్న అనుభవాలు, ఆధునిక పద్ధతుల వినియోగంపై నమూనాలు ఏర్పాటు చేశారు. యాంత్రిక పద్ధతులు, సేంద్రియ వ్యవసాయ పంటలతో లాభాలు, పంటలకు వచ్చే తెగుళ్లు, పురుగుల నివారణపై అవగాహన కల్పించారు. రమణారెడ్డి మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా వచ్చే మార్పులు, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. క్షేత్రస్థాయిలో అనుభవాలు మరింత ఉపయోగకరంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఏఓ నటరాజ్, వీఏఏ కౌషిక్, సర్పంచ్ అలివేలమ్మ, ఎంపీటీసీ వరలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు రఘునాథ రెడ్డి, రైతులు బయారెడ్డి, ఆదినారాయణ రెడ్డి, శ్రీనివాస్, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాను పరిశీలించండి



ధర్మవరం అర్బన్: మాట్లాడుతున్న ఆర్డీఓ రమేష్‌రెడ్డి, కమిషనర్ బండి శేషన్న



కదిరి అర్బన్: ఉత్తమ బూత్‌స్థాయి అధికారి వసుంధరను సన్మానిస్తున్న ఆర్డీఓ సన్నీవంశీకృష్ణ

ధర్మవరం అర్బన్: బీఎల్‌ఓలు మరోసారి ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాను సరిచేసుకోవాలని ఆర్డీఓ రమేష్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం సమావేశ భవనంలో పట్టణం, రూరల్ బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటర్ల జాబితా ఫైనల్ పబ్లికేషన్ ఉన్నందున బీఎల్‌ఓలు మరోసారి ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితాలను పరిశీలించాలన్నారు. డబుల్ ఓటర్లు, మృతి చెందిన ఓటర్లు, ఇళ్లు మారిన ఓటర్లు తదితర వాటిని గుర్తించి ఫారం–7 తీసుకుని ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలన్నారు. కొత్తగా 18 సంవత్సరాల వయస్సు నిండిన వారు ఫారం–6తో కొత్తగా ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓటర్లకు బీఎల్‌ఓలు వివరించి ఇంటింటి మరోసారి జాబితాను సరిచేసుకోవాలని సూచించారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి

అమడగూరు: రాబోయే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలో ఏర్పాటు చేస్తున్న పోలింగ్ కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ భాగ్యరేఖ పేర్కొన్నారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ.. ఇప్పటికే ఏర్పాటు చేసిన అన్ని కేంద్రాల్లో కల్పించిన వసతులపై ఆరా తీశారు. అలాగే ఓటరు లిస్టులో తప్పు, ఒప్పులు, మార్పులు, చేర్పులపై అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఏవైనా తప్పులున్నా ఓటర్లకు తెలియజేయాలని సూచించారు. వాటి సరవణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటరెడ్డి, ఆర్ఐ ఈశ్వరయ్య పాల్గొన్నారు.

బూత్‌స్థాయి అధికారులతో సమావేశం

కదిరి అర్బన్: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం ఓటర్ లిస్ట్ ఫైనల్ పబ్లికేషన్, పెండింగ్ క్లెయిమ్‌లపై బూత్‌స్థాయి అధికారులు, ఎలక్షన్ సూపర్‌వైజర్లు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్‌తో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీఓ సన్నీ వంశీకృష్ణ మాట్లాడుతూ.. 2024 ఎన్నికలపై చర్చించారు. జాతీయ ఓటరు దినోత్సవం రోజున రాష్ట్రస్థాయిలో ఉత్తమ బూత్‌స్థాయి అధికారిగా అవార్డు అందుకున్న గాండ్లపెంట మండలం పోలింగ్ కేంద్రం నెంబర్ 173 బూత్ స్థాయి అధికారి వసుంధరను సన్మానించారు. కార్యక్రమంలో డీటీ ముకుంద పాల్గొన్నారు.

అంతర్ విశ్వవిద్యాలయ పోటీలకు కదిరి విద్యార్థి



హర్షవర్ధన్ రాజు

కదిరి అర్బన్: ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకూ చెన్నైలో అంతర్ విశ్వవిద్యాలయాల టేబుల్ టెన్నిస్ పోటీలు జరగనున్నాయి. కదిరిలోని ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ చదువుతున్న హర్షవర్ధన్ రాజు ఎస్కే యూనివర్సిటీ జట్టుకు ఎంపికయ్యాడు. తమ కళాశాల విద్యార్థి అంతర్ విశ్వవిద్యాలయ పోటీలకు ఎంపిక కావడంతో ప్రిన్సిపాల్ డా.స్మిత, పీడీ నరసింహాచారితో పాటు పలువురు అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక



ఎంపికైన కదిరి క్రీడాకారిణులు

కదిరి అర్బన్: ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు కదిరి విద్యార్థులు ఎంపికైనట్లు ఆర్డీటీ క్రికెట్ కోచ్ నజీర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరు జిల్లా నరసారావుపేటలో ప్రారంభమైన అండర్–17 రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) బాలికల క్రికెట్ పోటీల్లో పాల్గొంటున్న ఉమ్మడి అనంతపురం జిల్లా జట్టుకు కదిరికి చెందిన తేజశ్విని, వింధ్య, జాగృతి ఎంపికయ్యారని పేర్కొన్నారు. కాగా.. తేజశ్విని సాధన పాఠశాలలో, జాగృతి నారాయణ పాఠశాలలో, వింధ్య భారతి రెక్కమాను జెడ్పీహెచ్ పాఠశాలల్లో చదువుతున్నారు.

రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి



మాట్లాడుతున్న కురుబ సంఘం నాయకులు

పుట్టపర్తి టౌన్: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కురబలకు రాజకీయాల్లో ప్రాధాన్యత కల్పించాలని ఆ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని సాయిఆరామంలో కురుబ సంఘం నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 4 లక్షల మంది కరుబలు ఉన్నారని తెలిపారు. ఎన్నికల్లో ఎంపీ, ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో కురుబ సంఘం జిల్లా అధ్యక్షుడు సామకోటి ఆదినారాయణ, తెలుగు రాష్ట్రాల కన్వీనర్ మంజునాథ్, గౌరవాధ్యక్షుడు శివానంద, నాయకులు రమేష్, కిష్టప్ప, బెల్లం సుధాకర్, దివాకర్, నాగరాజు, కమ్మన్న తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా పని చేయాలి



ఎస్పీ మాధవరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఐ రాజా రమేష్

పుట్టపర్తి టౌన్: పోలీసులు బాధ్యతగా పని చేస్తూ ప్రజల్లో నమ్మకం ఏర్పడే విధంగా సేవలు అందించాలని ఎస్పీ మాధవరెడ్డి సూచించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా పెనుకొండ, శ్రీకాళహస్తి సబ్‌డివిజన్‌లో పని చేస్తున్న సీఐలు రాజా రమేష్, విక్రమ్ శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువు అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్, దిశా పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. సోమవారం వీరు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ మాధవరెడ్డిని ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో విధుల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విధులు సక్రమంగా నిర్వర్తించి పోలీస్ వ్యవస్థకు మంచి పేరు తీసుకురావాలన్నారు.

ఆర్థికసాయం అందజేత



బాధితుడికి ఆర్థికసాయం అందిస్తున్న మహిళా సమాఖ్య సభ్యులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని రామ్‌నగర్‌లో గత ఏడాది డిసెంబర్ 10వ తేదీన విద్యుత్‌షాక్‌తో రమణదాస్, పుష్ప దంపతుల కుమారుడు ధర్మతేజ తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. సోమవారం బాధిత కుటుంబానికి పొదుపు సంఘాల సభ్యులు అండగా నిలిచారు. మారుతినగర్‌లోని నీలకంఠ మహిళా సమాఖ్య సభ్యులు సంఘం సభ్యురాలు అయిన ధర్మతేజ తల్లి పుష్పకు రూ.11 వేలు, ఆంధ్రజ్యోతి మహిళా సంఘం సభ్యులు రూ.10 వేల నగదు అందించి దాతృత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో ఆర్‌పీ నాగసంధ్య, సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మీదేవి, కార్యదర్శి నాగమణి, పుల్లమ్మ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్టార్టర్ చోరీ

నల్లమాడ: మండల కేంద్రానికి సమీపంలోని కొర్లకుంట వద్ద వ్యవసాయ బోరుబావికి అమర్చిన విద్యుత్ స్టార్టర్‌ను శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు సీ.కొత్తపల్లికి చెందిన రైతు ఎస్.మాధవరెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

డ్రైవర్ల పాత్ర కీలకం



మాట్లాడుతున్న ఎంవీఐ వరప్రసాద్

కదిరి అర్బన్: రోడ్డు ప్రమాదాలను అరికట్టడంలో డ్రైవర్ల పాత్ర కీలకమని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా కదిరి ఆర్టీసీ డిపో గ్యారేజీలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంవీఐ మాట్లాడుతూ.. కదిరి డిపో డ్రైవర్లు అప్రమత్తతతో విధులు నిర్వహించి ప్రమాద రహిత డిపోగా నిలబెట్టారన్నారు. పట్టణంలో నిర్దేశించిన పాయింట్లలో బస్సులు ఆపి, పోలీసుల సూచనలు పాటించాలని పేర్కొన్నారు. అనంతరం 32 ఏళ్ల సర్వీసులో ఎలాంటి ప్రమాదాలు చేయని డ్రైవర్లను సత్కరించారు. కార్యక్రమంలో డీఎం మైనుద్దీన్, ఏరియా ఆసుపత్రి వైద్యుడు హుస్సేన్, అసిస్టెంట్ మేనేజర్ హరిమోహన్, హరిత, రామకృష్ణ, అసోసియేషన్ నాయకులు నబీరసూల్, యాకూబ్‌ఖాన్ పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న రామలింగప్ప

ధర్మవరం అర్బన్: పట్టణంలోని గుట్టకిందపల్లి సమీపంలో ఉన్న పెట్రోల్ వద్ద ద్విచక్ర వాహనాన్ని జేసీబీ ఢీకొన్న ఘటనలో పట్టణంలోని కేతిరెడ్డి కాలనీకి చెందిన రామలింగప్ప తీవ్రంగా గాయపడ్డాడు. సోమవారం ఉదయం రామలింగప్ప ద్విచక్ర వాహనంలో అనంతపురం బయలుదేరాడు. గుట్టకిందపల్లి సమీపంలో ఉన్న పెట్రోల్ బంకు నుంచి రోడ్డుపైకి వచ్చిన జేసీబీ ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన రామలింగప్పను స్థానికులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స నిర్వహించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

పుట్టపర్తి టౌన్: స్థానిక డీఈఓ కార్యాలయంలో సోమవారం పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ముద్రించిన క్యాలెండర్, డైరీని డీఈఓ మీనాక్షి ఆవిష్కరించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పీఆర్‌టీయూ పని చేస్తుందని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు రజినీకాంత్‌రెడ్డి, బాబుసాబ్, ఉదయభ్కార్‌రెడ్డి, అనితాదేవి, రామాంజనేయులు, వెంకటేశ్వరరెడ్డి, సోమ్లానాయక్, సరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుల విజయోత్సవ సంబరాలు

బత్తలపల్లి: ధర్మవరం పట్టణంలో జరిగిన ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీల్లో బత్తలపల్లి జట్టు విజయం సాధించిన విషయం తెలిసిందే. జట్టు జిల్లా స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక కావడంతో ఆదివారం రాత్రి బత్తలపల్లిలో క్రీడాకారులు సంబరాలు చేసుకున్నారు. స్థానిక యువత, క్రీడాకారులు బాణాసంచాలు కాలుస్తూ, డీజే సౌండ్‌లు ఏర్పాటు చేసుకుని ట్రోఫీతో ఊరేగింపు నిర్వహించారు. స్థానిక గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ ఈడిగ కాశప్ప, నాయకులు సంద్ర రామకృష్ణ, మునలప్ప, మండల నారాయణ తదితరులు సంబరాల్లో పాల్గొని మరింత ఉత్సాహాన్ని నింపారు.

పండ్ల అలంకరణలో ఓంకారేశ్వరుడు



బత్తలపల్లి: మండల కేంద్రంలోని లలితా త్రిపుర సుందరీ సమేతా ఓంకారేశ్వరుడి ఆలయంలో సోమవారం ఓంకారేశ్వరుడిని వివిధ రకాల పండ్లతో అలంకరించారు. తెల్లవారుజామున స్వామికి అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు కేశవస్వామి ఓంకారేశ్వరుడిని వివిధ రకాల పండ్లతో అందంగా ముస్తాబు చేశారు. గ్రామానికి చెందిన బోరు శివయ్య పండ్లను సమకూర్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు.

బదిలీ ఉద్యోగులకు వీడ్కోలు



తాడిమర్రి: ఎంపీడీఓ విజయలక్ష్మిని సన్మానించిన దృశ్యం



ధర్మవరం: కమిషనర్ బండి శేషన్నను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

ధర్మవరం: స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో సోమవారం బదిలీపై వెళ్తున్న మున్సిపల్ కమిషనర్ బండి శేషన్నను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, చేనేత ప్రముఖుడు కాచర్ల అంజి, వార్డుల కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

తాడిమర్రి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పని చేస్తూ బదిలీపై వెళ్తున్న ఎంపీడీఓ బి.విజయలక్ష్మిని ప్రజా ప్రతినిధులు, కార్యాలయ సిబ్బంది సోమవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి, ఎంఈఓలు కృష్ణమోహన్, వెంకటేష్, పీఆర్ ఏఈ రవికుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ లక్ష్మీ, ఏపీఓ సంజీవరెడ్డి, పంచాయితీ కార్యదర్శులు రాజేంద్ర, రిజ్వానా బేగం, సర్పంచులు పుల్లయ్య, నారాయణస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు జొల్లిరెడ్డి రామన్న, పిట్టు పరమేశ్వర్‌రెడ్డి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

కదిరి అర్బన్: మండల పరిధిలోని కే.బ్రాహ్మణపల్లిలో ఆదివారం గుండెపోటుతో గంగులమ్మ (45) అనే మహిళ మృతి చెందింది. సోమవారం వైఎస్సార్‌సీపీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ మృతురాలి కుటుంబ సభ్యులకు రూ.10 వేల ఆర్థికసాయం చేశారు. ఈ మొత్తాన్ని తన కుమారుడు బీఎస్ అఖిల్, సర్పంచ్ ఖుర్షిద్ బేగం చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దాదాపీర్, ఇర్షాద్, అబూ, ఖాజాపీర్, నరసింహులు, మురళీ తదితరులు పాల్గొన్నారు.

నల్లమాడ ఎస్ఐగా రమేష్ కుమార్

నల్లమాడ: నల్లమాడ పోలీస్‌స్టేషన్ నూతన ఎస్ఐగా జి.రమేష్ కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. పెనుకొండ కియో పోలీస్ స్టేషన్ నుంచి ఈయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఎస్ఐగా పని చేస్తున్న వరలక్ష్మీ దేవి కొద్ది రోజులుగా సెలవులో ఉన్నారు.

విద్యుత్ లో ఓల్టేజీ సమస్యలు పరిష్కరించండి

కనగానపల్లి: వ్యవసాయ విద్యుత్ సరఫరా లో ఓల్టేజీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు మహదేవ, గోవిందు అధికారులను కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో రైతు సమస్యలపై వారు తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు పి.నాగరాజు, కార్యదర్శులు ఈశ్వరయ్య, ప్రసాద్, సీపీఐ మండల కార్యదర్శి బాలరాజు, రైతులు పాల్గొన్నారు.